సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 283 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.16.50

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.16.50, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.10 ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
38.3°/22.5°

జిల్లా పరిధిలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

మురి'పింఛన్'



దిగువచెర్లోపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ సుదర్శన్

పుట్టపర్తి అర్బన్: కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారితో పాటు సాంకేతిక కారణాలతో తాత్కాలికంగా నిలిపిన పింఛన్ లబ్ధిదారులందరికీ 'వైఎస్సార్ పింఛన్ కానుక' మొత్తం అందడంతో వారి మోము ఆనందంతో వికసించింది. ఈ నెల జిల్లాలోని 6,176 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో జిల్లాలోని పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 2,66,668కు చేరింది. వీరికి 'వైఎస్సార్ పింఛన్ కానుక' అందించేందుకు ప్రభుత్వం రూ.74,04,56,250 నగదు మంజూరు చేసింది. వలంటీర్లు శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఇంటింటికీ తిరుగుతూ 2,20,343 మందికి రూ.61,14,44,000 పింఛన్ మొత్తం పంపిణీ చేశారు. దీంతో తొలిరోజే 83 శాతం పింఛన్ పంపిణీ పూర్తయ్యింది.

ఓటరు పునఃపరిశీలన పక్కాగా చేయాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



బుక్కపట్నంలో ఓటరు తొలగింపు వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి: తొలగించిన ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియ పక్కాగా చేపట్టాలని కలెక్టర్ అరుణ్ బాబు బీఎల్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం ఆయన పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి బుక్కపట్నం 39, 43 పోలింగ్ కేంద్రాల పరిధిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మీ ఇంటికి బీఎల్‌ఓలు వచ్చారా...? అని ఆరా తీశారు. మృతుల ఓట్ల తొలగింపు సమయంలోనూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కరుణాకర్, సిబ్బంది ఉన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణతో కలిసి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష'పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... తొలి విడతలో భాగంగా 26 గ్రామాల్లో నిర్వహించిన రీసర్వే పూర్తయ్యిందన్నారు. రెండో దశలో 59 గ్రామాల్లో రీ సర్వే చేపట్టామని, పనులు వేగవంతం చేయాలన్నారు. ఇందుకోసం 13 నోటిఫికేషన్, డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిష్టర్ జారీ చేయనున్నట్లు వెల్లడించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేయాల్సి ఉందన్నారు. ఇక మూడో విడతలో 209 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉందన్నారు. డిసెంబర్ చివరి నాటికి రీ సర్వేలో అన్ని ప్రక్రియలను పూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

21 మండలాల్లో వర్షం



పుట్టపర్తిలో జలమయమైన రహదారి

పుట్టపర్తి అర్బన్: చాలా రోజుల తర్వాత వరుణుడు కరుణించాడు. జిల్లాలోని 21 మండలాల్లో వర్షించి రైతుల ఆశలను చిగురింపజేశాడు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 21 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా అమరాపురం మండలంలో 74.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అగళి 40.6 మి.మీ, సోమందేపల్లి 37.4 మి. మీ, మడకశిర 35 మి.మీ, రొద్దం 31.2, గుడిబండ 30.4, గోరంట్ల 24.2, ఓడీ చెరువు 19.2, పరిగి 16.4, చిలమత్తూరు 15.2, బుక్కపట్నం 14.6, సీకేపల్లి 14.2, అమడగూరు 13.4, నల్లమాడ 7.6, పెనుకొండ 7 మేర వర్షపాతం నమోదైంది. తాజా వర్షాలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మేలు చేస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

కారు.. జోరు



కారు.. గతంలో స్టేటస్ సింబల్. ఉన్నత వర్గాల వారి ఇళ్లముందే కనిపించేది. కానీ నేడు వీధిలో కనీసం 10 కార్లు కనిపిస్తున్నాయి. కరోనా తర్వాత చాలా కుటుంబాలు బస్సులు, రైళ్ల తదితర వాటిల్లో ప్రయాణించడం మానేశాయి. చిన్నదో, పెద్దదో ఓకారు కొనేస్తున్నారు. కుటుంబమంతా వెళ్లాల్సి వస్తే కాస్తంత దూరమైనా సరే కార్లలోనే రయ్యిమంటూ దూసుకుపోతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో కార్ల అమ్మకాలు భారీ పెరిగాయి. ప్రపంచమంతా ఇదే పరిస్థితి ఉండటంతో ఉమ్మడి జిల్లాలో తయరయ్యే కార్లు, కార్ల విడిభాగాలు భారీగా ఎగుమతి అవుతున్నాయి.

- ఎగుమతుల ఖిల్లా 'అనంత'
- ఉమ్మడి జిల్లాలో భారీగా కార్ల ఉత్పత్తి
- కార్ల విడిభాగాల తయారీ ఎక్కువే
- భారీగా పెరిగిన కార్ల విక్రయాలు
- 31 దేశాలకు కార్ల విడిభాగాల ఎగుమతులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి కార్ల ఎగుమతులు అనూహ్యంగా పుంజుకున్నాయి. అదేస్థాయిలో కార్ల కొనుగోళ్లు పెరిగాయి. కరోనా అనంతరం మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువ మంది కార్లలో ప్రయాణించడానికి మొగ్గు చూపుతుండటంతో ప్రతి ఇంటిముందూ కారు కనిపిస్తోంది. మరోవైపు కార్ల తయారీ, ఎగుమతులు, కార్ల విడిభాగాల ఎగుమతులు ఊపందుకున్నాయి.

పెరిగిన ఎగుమతులు..

ప్రపంచ వ్యాప్తంగా కార్ల వినియోగం పెరిగింది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో తయారయ్యే కార్లు, కార్ల విడి భాగాల ఎగుమతులు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే గడిచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.వేల కోట్ల టర్నోవర్ జరిగింది. ఇక్కడ తయారైన పలు వస్తువులు 92 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక శ్రీసత్యసాయి జిల్లాలో తయారవుతున్న కార్ల విడిభాగాలు 31 దేశాలకు వెళ్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే కార్లకు ఎంత డిమాండ్ ఉందో అంచనా వేయవచ్చు.

ఊపందుకున్న కార్ల కొనుగోళ్లు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొత్త కార్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కరోనాకు ముందు.. ఇప్పటి పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఒకప్పుడు కారు కొనాలంటే కనీసం రూ.50వేలకుపైగా వేతనం ఉంటేనే ఆలోచించేవారు. లేదా భారీస్థాయిలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారే కారు కొనేవారు. ఇప్పుడలా కాదు. చిరువ్యాపారులు కూడా కారు ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. బ్యాంకులు కూడా పిలిచి మరీ వెహికల్ లోన్లు ఇస్తుండటంతో కార్లు కొనేవారి సంఖ్య బాగా పెరిగింది. ముఖ్యంగా రూ.10 లక్షల్లోపు విలువైన కార్లకు భారీగా మార్కెట్ ఏర్పడింది. దీంతో ఉమ్మడి జిల్లాలో నెలకు సగటున 400 నుంచి 450 కార్ల వరకూ అమ్ముడవుతున్నట్టు అంచనా.

2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లా నుంచి కొన్ని ఎగుమతులు.. వాటి విలువ ఇలా..

కేటగిరీ	ఎగుమతుల విలువ (కోట్లలో)
స్పార్క్ ఇగ్నీషియన్ ఇంజిన్ కారు	880.98
మోటార్ కార్ విత్ 1,000 సీసీ	130.77
మోటార్ కార్ విత్ 1,500 సీసీ	361.84
మోటార్ కార్ విత్ 3,000 సీసీ	434.32
కారు యాక్సెసరీస్	229.89
కార్ల విడిభాగాలు	638.60

ఉమ్మడి జిల్లాలో నెలకు కార్ల అమ్మకాలు: 450

నెలకు అమ్మకాల విలువ: రూ.330 కోట్లు

ఏడాదికి సగటున టర్నోవర్: రూ.4,000 కోట్లు

వివిధ కంపెనీల షోరూంలు: 10 వరకు

మెరుగైన అమ్మకాలు



కరోనా తర్వాత చిన్న కార్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. చాలా మంది కుటుంబ సమేతంగా ప్రయాణం చేయాలంటే కారులో వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నారు. మొత్తంగా కార్ల అమ్మకాలు ఏటికేడూ పెరుగుతూనే ఉన్నాయి. ఇందులో బడ్జెట్ కార్లకు కాస్త డిమాండ్ ఎక్కువగా ఉంది.

– సోమశేఖర్, సర్వీస్ మేనేజర్, టయోటా

కార్ల వినియోగం భారీగా పెరిగింది



గతంతో పోలిస్తే కార్ల వినియోగం భారీగా పెరిగింది. దీంతో స్థానికంగా కార్ల కొనుగోళ్లు, ఇక్కడ తయారయ్యే కార్లు, వాటి విడిభాగాల ఎగుమతులు కూడా భారీగా పెరిగాయి. కోవిడ్ తర్వాత చాలా కుటుంబాలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌వైపు చూడటం లేదు. కాస్తంత దూరమైనా కార్లలో వెళ్లేందుకే ఇష్టపడుతున్నారు.

– నాగరాజారావు, జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ

సేవలకు 'ఉత్తమ' గుర్తింపు



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దేవాంగం జగదీశ్వర్ (ఫైల్)

- రాష్ట్రస్థాయి అవార్డుకు అబ్దుల్ రహిమాన్, జగదీశ్వర్ ఎంపిక
- 5న విశాఖలో విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డులు

పుట్టపర్తి /పుట్టపర్తి అర్బన్: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధిస్తూ వారి భవితకు బాటలు వేస్తున్న జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం రాష్ట్ర అధికారులు జాబితాను ప్రకటించారు. రెండు కేటగిరీల్లో జిల్లా ఉపాధ్యాయులకు అవార్డులు దక్కాయి. హెచ్‌ఎం, ప్రిన్సిపల్ కేటగిరీలో బుక్కపట్నం బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.అబ్దుల్ రహిమాన్, సెకండరీ గ్రేడ్ టీచరు కేటగిరీలో పుట్టపర్తి నగర పంచాయతీ పరిధిలోని ప్రశాంతి గ్రామం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న దేవాంగం జగదీశ్వర్ ఎంపికయ్యారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగే రాష్ట్రస్థాయి ఉత్సవాల్లో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

సేవకు ప్రతిరూపం జగదీశ్వర్

పుట్టపర్తి మండలం బత్తలపల్లి గ్రామానికి చెందిన ఎస్‌జీ టీచర్ దేవాంగం జగదీశ్వర్ ప్రస్తుతం పుట్టపర్తి నగర పంచాయతీ పరిధిలోని ప్రశాంతిగ్రామం మండల పరిషత్ ప్రాథమి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. 1996లో సెకండరీ గ్రేడ్ టీచరుగా విధుల్లో చేరారు. గోరంట్ల మండలం కరావులపల్లి పాఠశాలలో పనిచేసే సమయంలో ఆర్థిక పరిస్థితి సరిగా లేని అంధ విద్యార్థి నిర్మలను దత్తకు తీసుకుని చదివించారు. ప్రస్తుతం ఆమె గోరంట్ల ఉన్నత పాఠశాలలో టీచరుగా పని చేస్తోంది. గోరంట్ల మండలంలోనే ఖాజాపురం పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయడంతో పాటు బొమ్మలు వేయించి అందంగా తీర్చిదిద్దారు. ఆ



అవార్డుకు ఎంపికైన దేవాంగం జగదీశ్వర్



అవార్డుకు ఎంపికైన అబ్దుల్ రహిమాన్

పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంలో యూనిఫాం, నోటు పుస్తకాలు, విద్యా సామాగ్రి సమకూర్చారు. స్వగ్రామం బత్తలపల్లిలో తండ్రి చితంబరప్ప జ్ఞాపకార్థం ఏటా 70 మంది విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు అందిస్తున్నారు. ఆయన చదువుకున్న పెడపల్లి ఉన్నత పాఠశాలలో రూ.30 వేలు డిపాజిట్ చేసి 1998 నుంచి ఏటా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. 2021లో గోరంట్ల పులేరు రోడ్డులో శ్రీసత్యసాయి అక్షయ తృతీయ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభి ంచిన జగదీశ్వర్... సంచార జాతుల పిల్లల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. గోరంట్లలోని చేనేత కాలనీలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి దాదాపు వంద మందికి శిక్షణ ఇచ్చి సమీపంలోని గార్మెంట్స్ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించారు. కొంతమంది కేన్సర్, ఒంటరి మహిళలను చేరదీసి సంరక్షిస్తున్నారు. కరోనా సమయంలో ఎనలేని సేవలందించారు. ఇక విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధించడంతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణ, సేవా భావాన్ని అలవరుస్తున్నారు.

పిల్లలను బిడ్డల్లా చూసుకుంటూ..

బుక్కపట్నం బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.అబ్దుల్ రహిమాన్ 1984లో సెకండరీ గ్రేడ్ టీచరుగా విధుల్లో చేరారు. ఆయన బుక్కపట్నంలోనే చదివి అక్కడే బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. విధుల్లో చేరినప్పటి నుంచి రహిమాన్ విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. మెరుగైన బోధనతో ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. విద్యార్థులను బిడ్డలా చూసుకునే వారు. ఎక్కడ పనిచేసినా ఆ పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టేవారు. విరాళాలు సేకరించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేవారు. రహిమాన్ సేవలకు మెచ్చిన ప్రభుత్వం 2009లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందించింది. తాజాగా రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేసింది.

కౌలు రైతులకు భరోసా

- తొలిసారి 'వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్'వర్తింపు
- జిల్లాలో 615 మందికి రూ.46.12 లక్షల లబ్ధి
- 'ఇన్‌పుట్' కింద 207 మంది ఖాతాల్లోకి రూ.41.37 లక్షలు
- మెగా చెక్కులు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు



కౌలు రైతులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఇతరుల వద్ద భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న కౌలు రైతులకూ సీఎం జగన్ కొండంత భరోసా ఇచ్చారు. రైతులకు ఏటా అందజేసే 'వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్'పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేశారు. అలాగే దేవదాయ భూములు సాగుచేసుకుంటున్న రైతులకూ భరోసా అందించి వారి జీవితాల్లో వెలుగుల నింపారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కౌలు రైతులకు, దేవదాయ భూములు సాగు చేసే వారికి రైతు భరోసా మొత్తాన్ని, అలాగే మే నెలలో కురిసిన వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఆర్థిక సాయాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు మెగా చెక్కులను అందజేశారు.

భరోసా, ఇన్‌పుట్ కింద రూ.87.49 కోట్లు

జిల్లాలో గుర్తించిన 603 మంది కౌలు రైతులకు, అలాగే దేవదాయ భూములు సాగు చేస్తున్న 12 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.46,12,500, ఇటీవల గాలీవానతో పంటలు కోల్పోయిన 207 మంది రైతులకు రూ.41,37,550 ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. వైఎస్సార్ రైతు భరోసా కింద రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.13,500 అందిస్తున్నామని, ప్రస్తుతం కౌలు రైతులకూ 'భరోసా' కల్పిస్తున్నామన్నారు. గత మే నెలలో సంభవించిన గాలీవాన బీభత్సానికి పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, వెంటనే అంచనాలు తయారు చేసి ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, అగ్రీ బోర్డు పుట్టపర్తి మండల చైర్మన్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడికి ఇబ్బంది లేదు



సీఎం జగన్ రైతు భరోసా పేరుతో ఏటా రూ.13,500 అందజేస్తున్నారు. దీంతో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా పోయింది. గతంలో పంట పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకోవాల్సి వచ్చేది. దిగుబడులు కూడా వారికే తక్కువ ధరలకు ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

– మోహన్‌నాయక్, పెదపల్లి తండా, పుట్టపర్తి

కౌలు రైతులను గుర్తించిన జగన్



నేను భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసుకుంటున్నా. ఏ ప్రభుత్వమూ కౌలు రైతులను గుర్తించిన పాపన పోలేదు. కానీ సీఎం జగన్ తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థతో వలంటీర్లే ఇంటివద్దకు వచ్చి నా వివరాలు రాసుకుని కౌలు రైతు కార్డు ఇచ్చారు. ఇప్పుడు రైతు భరోసా అందజేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– ముత్యాలప్ప, కొత్తచెరువు

రేపు ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షలు

- ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అనంత డీఆర్‌ఓ గాయత్రీదేవి ఆదేశం



పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న అనంతపురం డీఆర్‌ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: "యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఆదివారం నేషనల్ డిఫెన్స్, (ఎన్‌డీఏ), నావల్ (ఎన్‌ఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షలు జరగనున్నాయి. వీటి నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసకులు కల్పించడంతో పాటు అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలి" అని డీఆర్‌ఓ గాయత్రిదేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఒక పరీక్ష కేంద్రంలో సీడీఎస్ పరీక్షలు, మరో కేంద్రంలో ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షలు జరుగుతాయన్నారు. మూడు సెషన్లుగా జరగనున్న సీడీఎస్ పరీక్షకు 101 మంది అభ్యర్థులు, రెండు సెషన్లుగా జరగనున్న ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షకు 83 మంది అభ్యర్థులు హాజరు అవుతారన్నారు. పరీక్షల నిర్వహణకు ఇద్దరు రూట్ కమ్ లైజన్ అధికారులను, ఇద్దరు ఇన్‌స్పెక్టింగ్ అధికారులను నియమించామన్నారు. యూపీఎస్‌సీ నిబంధనల ప్రకారం పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు.

పరీక్షల నిర్వహణ ఇలా...

- జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంగా సీడీఎస్ పరీక్ష పేపర్-1 ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు జరుగుతుంది. పేపర్-2 మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, పేపర్-3 మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి.
- ఖైవర్‌నగర్‌లోని ఆర్‌టీఓ ఆఫీసు పక్కనున్న కేఎస్‌ఎన్ ప్రభుత్వ బాలికల యూజీ, పీజీ కళాశాల కేంద్రంగా ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షకు సంబంధించి పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది.

అభ్యర్థులు ముందే చేరుకోవాలి


పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు నిర్దేశించిన సమయానికి కంటే అరగంట ముందే చేరుకోవాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోకి అనుమతించరు. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైన గుర్తింపు కార్డు (ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, పాన్‌కార్డ్, తదిరాలు) తీసుకురావాలి.

మరపురాని మహానేత వైఎస్సార్

- ప్రజా సంక్షేమమే ఆయన శ్వాస
- వైఎస్‌తో ప్రజలకు విడదీయలేని అనుబంధం
- ఏపీ రూపు రేఖలు మార్చిన రాజన్న

నేడు వైఎస్సార్ వర్ధంతి





కదిరి పట్టణానికి తాగునీటిని అందించే సీబీఆర్ (ఇన్‌సెట్‌లో) పంప్‌హౌస్

కదిరి: వైఎస్సార్.. ఆ పేరు వినగానే తెలుగునేల పులకిస్తుంది. ప్రతి గుండె ప్రతిస్పందిస్తుంది.. చిన్నాపెద్దా, వృద్ధులు ఇలా ఏ వయసు వారైనా ఆయన్ను మహానుభావుడని గుర్తు చేసుకోక తప్పదు. మరపురాని మహానేత వైఎస్సార్ చేసిన మేలును ఆయన వ్యతిరేకులు కూడా అంగీకరిస్తారు. 2009 సెప్టెంబర్ 2న ఒక దుర్దినం. తెలుగు ప్రజల గుండెలపై బండరాయి పడిన దినం. నిరంతరం ప్రజల గురించి, ప్రజల మేలు గురించి ఆలోచించే ఓ మంచి పాలనాదక్షుడిని కోల్పోయిన రోజు. ఆయన మనల్ని వీడి 14 ఏళ్లు గడచి పోయినా.. ఆయన జ్ఞాపకాలు మాత్రం చెరిగిపోలేదు. ఆ నవ్వుల రేడు..సంక్షేమ సారథి, అపరభగీరథుడిగా ప్రజల జ్ఞాపకాల్లో నిలిచి పోయాడు.

వైఎస్ హయాంలో జిల్లా ఎంతో అభివృద్ధి..

మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జిల్లా ఎంతో అభివృద్ధి చెందింది. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ఎంతోమందికి లబ్ధి చేకూరింది. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మిల్క్ బల్క్ చిల్లింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. రైతులు లోఓల్టేజ్‌తో ఇబ్బంది పడుతున్నారని గుర్తించి ప్రతి మండలంలో ఎన్నో సబ్ స్టేషన్లను ఏర్పాటు చేసి, వాటి సామర్థ్యాన్ని కూడా పెంచారు.

- కదిరి పట్టణ ప్రజలు మంచినీటికోసం అల్లాడిపోతున్నారని భావించి రూ.100 కోట్లతో శాశ్వత మంచినీటి పథకాన్ని ప్రవేశ పెట్టి ఇక్కడి ప్రజల దాహార్తిని తీర్చారు.
- హంద్రీనీవా పథకం ద్వారా కదిరి ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకొచ్చారు.
- కదిరి మండలం చెర్లోపల్లి వద్ద హంద్రీనీవా రిజర్వాయర్ నిర్మించారు.
- పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాలకు హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలు తెచ్చారు.
- ధర్మవరం పట్టణ ప్రజల దాహార్తి తీర్చడం కోసం రూ.84 కోట్లతో 'కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి శాశ్వత మంచినీటి పథకం' పేరుతో పార్నపల్లి రిజర్వాయర్ నుంచి మంచి నీటిని తీసుకొచ్చి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు.
- ధర్మవరం-మామిళ్లపల్లి రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించారు.
- చేనేత రుణమాఫీతో ధర్మవరంలోని చేనేతలకు ఎంతో లబ్ధి చేకూరింది.
- హిందూపురంలో ఒకప్పుడు మంచినీటికి చాలా ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను గుర్తించిన డాక్టర్ వైఎస్సార్ సుమారు రూ.600 కోట్లతో శాశ్వత మంచినీటి పథకాన్ని ప్రవేశపెట్టి తాగునీటి సమస్య పరిష్కరించారు.
- పెనుకొండ నియోజకవర్గంలో గోరంట్ల మినహా మిగిలిన మండలాల్లో హంద్రీనీవా కాలువలు తవ్వించారు.
- మడకశిర నియోజకవర్గం దాదాపుగా వైఎస్సార్ హయాంలోనే ఎక్కువ అభివృద్ధి జరిగింది. ప్రతి పల్లెకూ రోడ్లు వేశారు. మంచినీటి సమస్యలు తీర్చారు.

క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం



శిశువును చూపుతున్న 108 సిబ్బంది

నల్లమాడ: మండలంలోని సీ రెడ్డివారిపల్లికి చెందిన గంగిరెడ్డి భార్య మైత్రి 108 వాహనంలో ప్రసవమైంది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో మైత్రికి పురిటినొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. నల్లమాడ 108 వాహన ఈఎంటీ రియాజ్, పైలెట్ ఫయాజ్ గ్రామానికి చేరుకొని ఆమెను బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యలో చిత్రావతి బ్రిడ్జి వద్ద 108 వాహనంలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డ సురక్షితంగా ఉన్నారని, వారిని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో చేర్పించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య



మృతి చెందిన తేజ

ధర్మవరం రూరల్: పట్టణంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న మల్లేనిపల్లి తేజ (21) విషపుగుళికలు మింగి) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు.. తేజ వ్యక్తిగత అవసరాల కోసం తెలిసిన వారి దగ్గర అప్పు చేశాడు. దీనికితోడు మద్యానికి బానిసయ్యాడు. అప్పు తీర్చలేక మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బొలేరోవాహనం ఢీ కొని చిన్నారి మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం సచివాలయం దగ్గర బొలేరో వాహనం ఢీకొని ఆదిత్యరెడ్డి (5) శుక్రవారం మృతి చెందాడు. కణేకల్లు మండలం నల్లంపల్లికి చెందిన రవికుమార్ రెడ్డి పట్టణంలోని చర్చి ఏరియాలో నివాసం ఉంటున్నాడు. హౌసింగ్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. భార్య రోజాకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో నాటువైద్యం చేయించడానికి 74 ఉడేగోళం గ్రామానికి ద్విచక్రవాహనంపై కుమారులు ఆదిత్యరెడ్డి, అథర్వరెడ్డితో కలిసి బయల్దేరాడు. సచివాలయం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపక్కన ఆపాడు. పక్కనే నిల్చున్న బాలుడిని రాయదుర్గం వైపు నుంచి అనంతపురం వైపు వేగంగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొనింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే కుమారుడు కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సెంటర్ మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం యాంబర్ ప్రాజెక్టు తరపున 45 రోజుల పాటు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, రిటైల్ సేల్స్ అసోసియేట్ జాబ్‌రోల్స్. కంప్యూటర్ శిక్షణ, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పైనా శిక్షణ ఉంటుందన్నారు. నిరుద్యోగ యువత వెంటనే స్థానిక రాజురోడ్డులో ఉన్న కౌశల్ కేంద్రంలో సంప్రదించాలన్నారు. వివరాలకు సెల్: 93981 54460, 7569659964లో సంప్రదించాలని తెలిపారు.

పెరవలిలో వివాహిత ఆత్మహత్య

శింగనమల: మండలంలోని పెరవలిలో సుహాసిని (25) అనే వివాహిత ఉరివేసుకొని శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్‌ఐ చితంబరప్ప తెలిపిన మేరకు.. పెరవలికి చెందిన సుహాసిని కుటుంబ సభ్యులతో శుక్రవారం ఉదయం ఘర్షణ పడింది. వెంటనే ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకొని చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే కుటుంబ సభ్యులు తలుపులు ధ్వంసం చేసి, ఇంట్లోకి వెళ్లి సుహాసినిని కిందకు దింపి, అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించగా, అప్పటికే ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలేపల్లిలో వ్యక్తి ఆత్మహత్య...

బ్రహ్మసముద్రం : మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన చిన్ననీలప్ప (43) ఉరివేసుకొని శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. చిన్న నీలప్ప బతుకుదెరువుకోసం బెంగళూరుకు వలస వెళ్లాడు. అయితే గురువారం రాత్రి స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

చిలమత్తూరు: మండలంలోని 44వ జాతీయ రహదారిపై ఆంజనేయ తండా వద్ద కోడూరుకు చెందిన శ్రీనివాసులు (20) అనుమానాస్పదస్థితిలో శుక్రవారం మృతి చెందాడు. మృతుడి శరీరంపై రక్త గాయాలున్నాయి. దుస్తులు కూడా లేకుండా రోడ్డుపై పడి ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పరేడ్‌తో శారీరక దృఢత్వం

- జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: పరేడ్ నిర్వహించడం వల్ల సిబ్బందిలో నైపుణ్యాలు మెరుగుపడడమే కాకుండా, శారీరక దృఢత్వంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డులు, పుట్టపర్తి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. పరేడ్‌లో సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరేడ్ అనేది పోలీసులు సంప్రదాయాల్లో ఒక భాగం అని స్పష్టం చేశారు. పరేడ్ నిర్వహించడం వల్ల నైపుణ్యాలు మెరుగుపడడమే కాకుండా శారీరక దృఢత్వం ఏర్పడి, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఏఆర్ సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే శుక్రవారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో తెలుపుకుంటే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐలు టైటస్, నారాయణ, ఆర్‌ఎస్‌ఐలు, హోంగార్డులు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతలు కాపాడడంలో నిరంతరం శ్రమించే పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి పట్టణంలో ఉన్న పరేడ్ మైదానంలో పోలీస్ దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పోలీసులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. వారు మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేసే పోలీస్ సిబ్బంది పరిష్కరించే బాధ్యత తనపై ఉందని, నేరుగా ప్రతి ఒక్కరి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐలు టైటాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో బాలనేరస్తులకు శిక్ష

చిలమత్తూరు: మండల కేంద్రంలోని సూపర్‌మార్కెట్‌లో చోరీకి పాల్పడిన హిందూపురంకు చెందిన ముగ్గురు మైనర్లకు ఐదునెలల జైలు విధిస్తూ జువైనల్ కోర్టు జడ్జి ప్రతిభ తీర్పు వెలువరించారు. ఈఏడాది ఏప్రిల్ 28న రాత్రి ఐదుగురు బాలురు చిలమత్తూరు సూపర్ మార్కెట్లోకి ప్రవేశించి రూ.35 వేలు నగదు, మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. ఈకేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

మద్యం బాబును మొబైల్ కాపాడింది



జోసెఫ్‌తో ప్రొద్దుటూరు పోలీసులు దామోదర్, గురుశేఖర్

ప్రొద్దుటూరు క్రైం: మొబైల్ ఫోన్‌తో ఎక్కువ సమయం గడిపితే ముప్పు తప్పదు...ఆరోగ్యం కూడా పాడవుతుందని వైద్యులు పదేపదే చెప్తుంటారు. అయితే ఒక్కో సందర్భంలో మొబైల్ కూడా అత్యవసరమని గుర్తు చేసింది వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన ఘటన. ఫూట్‌గా మద్యం తాగి కాలువలో పడిపోయిన మద్యంబాబు ప్రాణాలను సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు కాపాడారు. అనంతపురం జిల్లాకు చెందిన జోసెఫ్..ప్రొద్దుటూరులో వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా మోడంపల్లెలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఫూటుగా మద్యం తాగి, మత్తులో రైల్వే స్టేషన్ సమీపంలోని మురుగు కాలువలో పడిపోయాడు. అతడు కనిపించలేదని బంధువులు టూటౌన్ సీఐ ఇబ్రహీంకు ఫిర్యాదు చేశారు. అతడి వద్ద సెల్‌ఫోన్ ఉందని చెప్పారు. దీంతో పోలీసులు సెల్‌ఫోన్ ఆధారంగా లొకేషన్ కనుక్కొని, గాలింపు చేపట్టారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్లు తెలిసి, సీఐ ఇబ్రహీం హుటాహుటిన కానిస్టేబుళ్లు దామోదర్, గురుశేఖర్‌ను పంపి స్థానికుల సాయంతో బయటికి తీయించారు. అర్ధరాత్రి సమయంలో ప్రొద్దుటూరుకు తీసుకొచ్చి వైద్యం చేయించిన తర్వాత కౌన్సెలింగ్ ఇచ్చి, బంధువులకు అప్పగించారు.

బీటెక్ మూడో సంవత్సరం ఫలితాలు విడుదల



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్ 20) పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్‌వీ సత్యనారాయణ తెలిపారు. ఆగస్టు 14న జరిగిన పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని ప్రినిపాల్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఇ. అరుణ కాంతి, హెచ్ఓడీలు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ యం. రామశేఖర రెడ్డి, ఆచార్య భువనవిజయ, డాక్టర్ లలిత కుమారి, అజిత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బెంగాల్ యూత్ కచేరీ





సంగీత కచేరీ నిర్వహిస్తున్న బెంగాల్ సత్యసాయి యూత్

ప్రశాంతి నిలయం: సాయికుల్వంత్‌సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన బెంగాల్ యూత్ సంగీత కచేరి ఆకట్టుకుంది. సత్యసాయి వైభవాన్ని చాటుతూ చక్కటి గీతాలు ఆలపించారు. మూడు రోజుల పాటు సాగిన బెంగాల్ సత్యసాయి భక్తుల పర్తి యాత్ర శుక్రవారం ముగిసింది. భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. భక్తులకు నూతన వస్త్రాలతో పాటు సత్యసాయి జ్ఞాపికలను అందించారు.

ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కదిరి టౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న తేదీ (శుక్రవారం) ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కలశపూజ అనంతరం వరలక్ష్మీ వ్రతం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 6వ తేదీలోపు పేరు, చిరునామా, గోత్రం తదితర వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే వ్రతంలో పాల్గొనే వారు తప్పకుండా కలశం (రాగి, ఇత్తడి చెంబు) తీసుకురావాలన్నారు. పూజా కార్యక్రమానికి సంబంధించిన వస్తువులన్నీ తామే ఉచితంగా అందిస్తామన్నారు.

ఉట్లమాను ఉత్సవం

ఈ నెల 8వ తేదీ (శ్రావణ బహుళ నవమి, రోహిణీ నక్షత్రం) సాయంత్రం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఖాద్రీ ఆలయం ముందు ఉట్లమాను ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లు చరిత్రాత్మకం



మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగ రంగాల్లో పదిశాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయడం చరిత్రాత్మక నిర్ణయమని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పుట్టపర్తి పట్టణంలో సాయి ఆరామంలో అయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక వెనుకబాటు ప్రతిపాదన అగ్రోపేదలకు 10శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం హర్షించదగ్గవిషయమన్నారు. ఏ సామాజిక వర్గానికి చెందిన రిజర్వేన్‌కు నష్టం కలగకుండా కేవలం నిరుపేద ఓసీలకు మాత్రమే లబ్ధి చేకూరేలా 103 రాజ్యాంగ సవరణ ద్వారా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలుపర్చినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఆరుకోట్లకు పైగా ఉన్న నిరుపేద ఓసీలను ఓబీసీ జాబితాలో చేర్చి, ఆర్థికంగా ఆదునేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 50 వేల కోట్లతో ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కేంద్రంలో,రాష్ట్రంలో వేరువేరుగా ఉన్నందున నిరుపేద ఎటసీలు గందరగోళంగా ఉన్నారని రెండు ప్రభుత్వాలు ఒకే విధంగా సరళీకృతం చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో అన్ని ప్రధాన రాజకీయపార్టీలు వచ్చే ఎన్నికల్లో ఓసీల సమస్యలను తమ ఎజెండాలో చేర్చి, పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బీఎస్‌ఎఫ్ ఉద్యోగి ఆకస్మిక మృతి



మృతి చెందిన ఉమామహేశ్వర్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని 25వవార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ తమ్ముడు పసల పూజారి ఉమామహేశ్వర్ శుక్రవారం ఢిల్లీలో గుండెపోటుతో మృతిచెందాడు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వెంకటేష్ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా బీఎస్‌ఎఫ్‌లో విధులు నిర్వహిస్తూ గుర్తింపును తెచ్చుకున్న ఉమామహేశ్వర్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఢిల్లీలోని జీ 20 విభాగంలో విధులు నిర్వహిస్తుండగా తెల్లవారుజామున చాతీలో నొప్పి రావడంతో తోటి ఉద్యోగులు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఉమామహేశ్వర్ మృతదేహం సొంత గ్రామమైన మేడాపురానికి శనివారం చేరుతుంది .

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి



మృతుడు రంగనాథ

అమరాపురం: మండలంలోని కెంకెర గ్రామానికి చెందిన గొర్రెల కాపరి రంగనాథ (42) విద్యుదాఘాతంతో శుక్రవారం మృతిచెందాడు. వివరాలు.. రంగనాథ రోజు మాదిరిగానే గొర్రెలను మేతకోసం నిద్రగట్ట గ్రామానికి తీసుకెళ్లాడు. ఇదే గ్రామానికి చెందిన క్రిష్ణగిరి మల్బరీ పంట రక్షణ కోసం విద్యుత్ తీగ ఏర్పాటు చేశాడు. ఈవిషయాన్ని గుర్తించని రంగనాథ.. విద్యుత్‌తీగను తాకాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరాతీశారు. మృతుడి భార్య లతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుక్కల దాడిలో 14 గొర్రెపిల్లలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

రొద్దం: మండలంలోని తురకలాపట్నం గ్రామానికి చెందిన కురుబ మిడిగేసి రామన్నకు చెందిన 14 గొర్రె పిల్లలు కుక్కలదాడిలో మృతిచెందాయి. శుక్రవారం మధ్యాహ్నం ఇంటివద్ద ఎవరూ లేని సమయంలో కుక్కలు గొర్రె పిల్లలపై దాడి చేశాయి. దీంతో దాదాపు రూ. 60 వేలు నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.